క్లుప్తంగా

ప్రాదేశిక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

దామెర : మండలంలోని 36 ప్రాదేశిక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయం ముందు పోలింగ్ కేంద్రాల తుదిజాబితాను ప్రదర్శించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో మొత్తం 36 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో 41 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 36కు కుదించబడ్డాయని ఒక్కో పోలింగ్ కేంద్రంలో సుమారు 600కు పైగా ఓటర్లు ఉన్నట్లుగా వారు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 21,976 మంది ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు.

బాధితుడికి చేయూత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల అరవింద్ ఇటీవల రైలుపట్టాలపై పడి తన రెండు కాళ్లు, ఒక చేయి కోల్పోవడంతో వరంగల్‌లోని గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్పందించిన పెద్దకోడెపాకకు చెందిన సామాజిక సేవకుడు అమ్మ అశోక్ దాతల సహకారంతో రూ. 40వేలు సేకరించి శనివారం ఆస్పత్రిలో అరవింద్ తల్లిదండ్రులు అందజేశారు. అందజేసిన వారిలో కోగిల శరత్, గట్టు నవీన్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా అరవింద్



వేలేరు : ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన జెట్టి అరవింద్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ మండలంలో ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైర్ చోరీ

వేలేరు : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్ చోరీ చేసిన ఘటన మండలంలోని బండతండా గ్రామశివారు మాటుతండాలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. చోరీకి గురైన కాపర్ వైర్ విలువ రూ.5 వేల వరకు ఉంటుందన్నారు. ఏఈఈ కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రీ సర్వేలో స్పష్టంగా నమోదు చేయించాలి

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 16 నుంచి చేపడుతున్న కుల గణన రీ సర్వేలో పద్మశాలి కులస్తులు అందరూ పద్మశాలి కులాన్ని ఎన్యుమరేటర్లతో స్పష్టంగా నమోదు చేయించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరి మెంబర్ బాసాని చంద్రప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో భాగంగా ప్రతి కుటుంబానికి కుల గణన సర్వే చేపడుతుందని అన్నారు. పద్మశాలి కులస్తులందరూ కాలం 7లో నేతకాని, శాల అని రాయించకుండా పద్మశాలి అని నమోదు చేయించాలని సూచించారు. కుల గణనలో పద్మశాలిల జనాభా కూడా ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెరిగే అవకాశం లభిస్తుందని చంద్రప్రకాష్ తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

దామెర : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై అశోక్ సూచించారు. శనివారం మండలంలోని ఒగ్లాపూర్ వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ద్విచక్రవాహనదారడు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, అతివేగం ప్రమాదకరమని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి తూట్లు!

- 'కోనోకార్పస్'తో అనారోగ్య సమస్యలు
- పల్లె ప్రకృతి వనాలు, రోడ్లవెంట ఉన్న చెట్లు



పీచరలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

వేలేరు : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా పల్లెప్రకృతి వనాలు, ప్రధాన రహదారులు, రైతు వేదికలు, ఇతర చోట్ల కోనోకార్పస్ మొక్కలను పెద్దసంఖ్యలో నాటారు. పచ్చదనం కోసం పెంచిన మొక్కలతో లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంది. వీటితో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని ఆరోగ్య, పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో ..

మండలంలోని పలు గ్రామాల్లో హరితహారం కార్యక్రమంలో భాగంగా కోనోకార్పస్ మొక్కలను నాటి పెంచుతున్నారు. ప్రధానంగా పీచర, శాలపల్లి, తదితర గ్రామాల్లో రోడ్లకిరువైపులా చెట్లు ఏపుగా పెరిగి పెద్దవై పూతతో పాటు కాయలు కూడా కాస్తున్నాయి. ఈ చెట్లతో పచ్చదనం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. ఈ చెట్లను పశువులు తినడం లేదని, కనీసం పక్షులు కూడా చెట్లపై వాలడం లేదు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవెన్యూ ప్లాంటేషన్, పల్లెప్రకృతి వనాలు, నర్సరీల్లో పెంచిన ఈ మొక్కలను తొలగించాలని గతంలో ప్రభుత్వం ఆదేశాలిచ్చిన అధికారులు పట్టించుకోలేదు. ప్రజల ఆరోగ్యాలకు హానీ కలిగించే కోనోకార్పస్ చెట్లను మండల వ్యాప్తంగా తొలగించి వాటి స్థానంలో మంచి గాలి, ఆరోగ్యాన్నిచ్చే మొక్కలు నాటాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చెట్లను తొలగించాలి



పలు గ్రామాల్లో రోడ్లవెంట, పల్లెప్రకృతి వనాలు, ఇతర ప్రదేశాల్లో గత ప్రభుత్వ హయాంలో నాటిన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలి. వీటి స్థానంలో నీడనిచ్చే మొక్కలు నాటాలి.

– రాజు యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు

పూల మొక్కలు పెంచాలి



ప్రజల ఆరోగ్య సమస్యలకు, పర్యావణానికి చేటు కలిగిస్తున్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలి. మంచి స్వచ్ఛమైన గాలిని ఇచ్చే పూల మొక్కలు పెంచాలి.

– మంతపురి శ్రీనివాస్, పీచర

రైతులు సర్వేకు సహకరించాలి

- పరకాల ఆర్డీఓ నారాయణ



మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ

దామెర : గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి సర్వేకు రైతులు సహకరించాలని పరకాల ఆర్డీఓ నారాయణ రైతులను కోరారు. శనివారం మండలంలోని ఊరుగొండలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భూ బాధిత రైతులతో ఆయన మాట్లాడారు. బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని అలైన్మెంట్ మారదన్నారు. రైతులు కలెక్టర్‌కు ఆర్బిట్రేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే మెరుగైన నష్టపరిహారం పొందవచ్చన్నారు. భూబాధిత రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. ఆయన వెంట పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు అశోక్, తేజ ఉన్నారు.

మహిళల సంక్షేమానికి కృషి చేయాలి

- సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ ఇందిర



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర

కమలాపూర్ : మహిళా సహాయక కమిటీలు మహిళల సంక్షేమం కోసం పని చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఇందిర సూచించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో శనివారం నిర్వహించిన గ్రామ స్థాయి మహిళా సహాయక కమిటీ సభ్యుల శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల సమస్యలు తెలుసుకుని వారికి సహకరించే సంస్థలు, వ్యవస్థలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్, యూత్ సభ్యులు, రైతు సంఘాల నాయకులు, వార్డు సభ్యులు సభ్యులుగా సర్వోదయ మహిళా సహాయక కమిటీలను ఏర్పాటు చేసి మహిళా చట్టాలు, సహకరించే వ్యవస్థలపై శిక్షణలు, క్షేత్ర సందర్శనలతో వారి నైపుణ్యాలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో మహిళా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కమిటీలు కృషి చేస్తూ మహిళలకు హింస లేని సంక్షేమ సమాజాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సహాయక కమిటీ సభ్యురాలు లావణ్య, హైమ, పద్మ, మమత, సర్వోదయ సంస్థ కో ఆర్డినేటర్ శ్రీలత, పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఉర్సు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



గంధం, చాదర్‌ను తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : మతసామరస్యానికి ఉర్సు ఉత్సవాలు ప్రతీక అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రాయగూడెంలోని హజ్రత్ ఖాదర్ షా బాపు సైలానీ హర్మనీ ఉర్సు ఉత్సవాల్లో ఆయన పాల్గొని గంధం, చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కులమతాలకు అతీతంగా దర్గా వద్దకు వచ్చి తమ కోరికలు తీర్చాలని ప్రార్థిస్తారని అన్నారు. రానున్న రోజుల్లో దర్గా అభివృద్ధికి తగినన్ని నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు పెసరు రమేష్, గొడల రాజిరెడ్డి, రాజమణి మొగిలి, ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

వేలేరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మండలంలోని శాలపల్లి గ్రామంలో గృహనిర్మాణ శాఖ పీడీ రాజేందర్ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు 400 చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మించుకోవాలని, అంతకంటే తక్కువ విస్తీర్ణంలో నిర్మించకూడదని అన్నారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి కావల్సిన సిమెంట్, ఇసుక, ఉక్కును తక్కువ ధరకే అందించనున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన తర్వాత పంచాయతీ కార్యదర్శి వెళ్లి యాప్‌లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని అన్నారు. ఇంకా ఇళ్ల నిర్మాణానికి అర్హత కలిగిన వారు ఉంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం పై అవగాహన అవసరం

- పరకాల ఎస్సై శివకృష్ణ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై శివకృష్ణ

పరకాల: మొబైల్స్‌కు వచ్చేటువంటి అపరిచిత లింక్‌లను, ఓటీపీలను షేర్ చేయకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్సై శివకృష్ణ అన్నారు. లింక్‌లపై ఏ మాత్రం క్లిక్ చేసిన నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ యుగంధర్ అధ్యక్షతన సైబర్ క్రైం మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూనే నేటి మార్కెట్‌లో డ్రగ్స్ ఏ విధంగా అమ్ముతున్నారో.. వాటి వలన విద్యార్థులు, యువత భవిష్యత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందో అనే విషయాలను వివరించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం తెలియగానే పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు లేదా పోలీస్ హెల్ప్‌లైన్ సమాచారం అందజేయాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు బాధ్యతా యుతంగా తమ తల్లిదండ్రులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని సూచించాలని కోరారు. ఉపాధ్యాయులు ఇళయరాజా, కుమారస్వామి, నాగరాజు, సంతోష్, సుమన్, గీత, రవళిక, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

- రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

ధర్మసాగర్ : 2023 శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ మేనిఫెస్టోలోని హామీలన్ని అమలు చేయాలని రిటైర్డ్ ప్రొఫెసర్, తెలంగాణ ఉద్యమకారుడు కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల నుంచి నుండి దేశ జనాభాలో 50 శాతం మంది బీసీలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో, కాంట్రాక్టుల్లో బీసీలకు 42 శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. బీసీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా బీసీ నిరుద్యోగ యువతకు సున్నా వడ్డీతో సబ్సిడీ రుణాలిస్తామని, గొల్లకురుమలకు రెండో దశ గొర్రెలను పంపిణీ చేస్తామని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్ల కాలంలో బీసీలను అన్నిరంగాల్లో అణగదొక్కి ఇప్పుడు బీసీలకు అన్యాయం జరుగుతుందని అనడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికీ అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారని, రానున్న రోజుల్లో బీసీలు అన్ని పార్టీల నాయకులకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు



శాయంపేట : మండలంలోని కాట్రపల్లి, గంగిరేణిగూడెం, సూర్యనాయక్ తండా గ్రామాల్లో, కాకతీయ యూనివర్సిటీలో సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలను హ్యూమన్ రైట్స్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. బంజార ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేశ్, తిరుపతి, వెంకట్, కిరణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కమలాపూర్ : మండలంలోని వంగపల్లి, పంగిడిపల్లిలో సాలిడో రాక్స్, మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, క్వారీ సిబ్బందికి సీఎస్‌సీ సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ వినయ్ మాట్లాడుతూ క్వారీలో పని చేసే కార్మికుల ఆరోగ్యం, గ్రామస్తుల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యమన్నారు. నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్వారీ మేనేజర్ సుభాష్‌చంద్ర నాదర్‌మల్ చౌదరి, అంకం విద్యాసాగర్, క్వారీ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ వేయించుకున్న చిన్నారులతో ఏఎన్‌ఎం, తదితరులు

శాయంపేట : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు విలేజ్ హెల్త్ న్యూట్రీషన్ డే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం శ్రావణి మాట్లాడుతూ సబ్ సెంటర్‌కు రాని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలోనే వ్యాక్సినేషన్ చేసినట్లు తెలిపారు. చిన్నారులకు సరైన సమయానికి వ్యాక్సిన్ వేయించడం వల్ల తట్టు, మెదడువాపు, పోలియో, ధనుర్వాతం వంటి వ్యాధులు సోకవని తెలిపారు. 10 ఏళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్వేత, ఆశా వర్కర్లు, బాలింతలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో దేవా.. గోడు ఆలకించేదెవరు?

- సంగెం, వర్ధన్నపేట, ఖిలావరంగల్ మండలాలకు దేవాదుల నీరు బంద్
- ఎత్తిపోతల నీరు రాకుండా తూములు మూసిన ఐనవోలు మండల రైతులు
- ఎండిపోతున్న పంటలు.. పాలకులు, అధికారులు స్పందించాలని అన్నదాతల వేడుకోలు



ఐనవోలు మండలంలో నిండుగా ప్రవహిస్తున్న దేవాదుల ఎత్తిపోతల కాల్వ నుంచి నీరు రాకుండా పోసిన సిమెంట్

సంగెం: ఎప్పటిలాగే దేవాదుల ఎత్తిపోతల నీరు వస్తుందనే గంపెడాశతో సంగెం, వర్ధన్నపేట, ఖిలా వరంగల్ మండలాల్లోని పలు గ్రామాల రైతులు పంటలు సాగు చేశారు. కాల్వ వెంట ఉన్న సుమారు 2 వేల ఎకరాలతోపాటు కుంటలు, చెరువుల్లోకి సైతం నీరు వచ్చేదని రైతులు పేర్కొంటున్నారు. రైతులు రాత్రింబవళ్లు నిద్రాహారాలు మాని కాల్వ వెంట ఉంటూ సంగెం మండలం ఆశాలపల్లి, గవిచర్ల గ్రామాల్లోని పంటలకు నీరందించారు. తీరా చూస్తే 20 రోజులుగా చుక్క నీరు రావడం లేదు. ఎందుకని పలువురు రైతులు కాల్వ వెంట వెళ్లారు. ఐనవోలు మండలం వెంకటాపూర్ వద్ద వర్ధన్నపేట మండలం చెన్నారం, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట, సంగెం మండలం ఆశాలపల్లి, కాట్రపల్లి, గవిచర్ల, తీగరాజుపల్లి, రామచంద్రాపురం, లోహిత, షాపూర్ తదితర గ్రామాలకు నీరు రాకుండా కాల్వ రెండు గేట్‌వాల్వ్‌లు పూర్తిగా మూసివేసి సిమెంట్ పోశారు. ఒక తూముకు అడ్డంగా సిమెంట్ పోయగా కొద్దిగా జాలు మాత్రమే వస్తోంది. దీంతో నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మూడు మండలాల్లోని గ్రామాల ఆయకట్టుకు దేవాదుల నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాల్వ నీటిపైనే ఆధారపడి పంటలు సాగు చేశాం



దేవాదుల ఎత్తిపోతల నీరు వస్తుందనే ఆశతో మొక్కజొన్న పంట సాగు చేశాం. పంట కంకి దశలో ఉన్నది. ఇప్పుడు మొక్కజొన్న పంటకు నీరు అధికంగా అవసరం ఉన్నది. మాకు నీరు రాకుండా అక్కడి రైతులు తూములు మూసివేశారు. దీంతో నీరు రావడం లేదు. పెట్టుబడి అంతా పెట్టి తీరా పంట చేతికి వచ్చే సమయంలో నీరు రాకుంట చేసిళ్లు. మా గోడు పట్టించుకునే వారు లేరు. పాలకులు, అధికారులు స్పందించి నీరు వచ్చేలా చేసి ఆదుకోవాలి.

– పెద్దపల్లి సాంబయ్య, రైతు గవిచర్ల

స్వయంప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ



నిరసన తెలుపుతున్న నాయకులు

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నూతన ముసాయిదా –2025 దేశ సమైక్య స్ఫూర్తికి విరుద్ధమని, ఇది రాజ్యాంగం వివిధ రాష్ట్రాలకు కల్పించిన హక్కులను కాలరాయడమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ విమర్శించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ముసాయిదా పత్రాలను దహనం చేసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రపూరిత విధానాలను అనుసరిస్తోందని అన్నారు. విద్యారంగం పట్ల ఏమాత్రం అనుభవం లేని వివిధ రంగాల్లోని బడా కార్పొరేటర్లు, వ్యాపారవేత్తలను వీసీగా నియమించుకునే విధంగా యూజీసీ రూపొందించిన నూతన ముసాయిదాను ఉపసంహరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, నాయకులు కావ్య, అనూష, కేయూ కన్వీనర్ బాలు, బాధ్యులు గణేష్, వినయ్, యాదగిరి, హరికృష్ణ, సాయి, శ్రీజ, సాధన, రాజశేఖర్, పృథ్వీరాజ్, చారి, దిలీప్ పాల్గొన్నారు.

ఆధునిక యుగంలో ఆటవిక చర్యలు

- దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్

హన్మకొండ: ఆధునిక యుగంలో ఆటవిక చర్యలకు పూనుకోవడం ఆందోళన కలిగిస్తోందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, గోర్ సభ జాతీయ నాయకుడు జైసింగ్ రాథోడ్ అన్నారు. తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా మానామధురైకి చెందిన దళిత విద్యార్థి అయ్యస్వామి చేతులు నరికిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుల్లెట్ వాహనం నడిపినందుకు రెండు చేతులు నరికివేయడంపై సభ్య సమాజం సిగ్గుతో తల దించుకోవాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ వెంటనే బాధిత కుటుంబాన్ని సందర్శించి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. చట్టాన్ని చుట్టంలా మార్చుకుంటున్న మనువాద మానవ మృగాలను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టానికి పదునుపెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్, డీబీఎఫ్ నాయకులు బొర్ర సంపూర్ణ, కరుణాకర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ సంతోష్

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులు పట్టుకొని అతనికి అప్పగించారు. సీఐ సంతోష్ కథనం ప్రకారం.. ఆత్మకూరులో శనివారం రాత్రి కొమ్మి ప్రేమ్‌సాయి రూ.38 వేల విలువ చేసే సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టెక్నాలజీ సాయంతో 15 నిమిషాల్లోనే ఆత్మకూరు శివారులో సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించారు. సీఐ సంతోష్ వెంట ట్రైనీ ఎస్సై శ్రావణ్ ఉన్నారు. బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.